ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే



చందానగర్: రంజాన్‌మాసం చాలా పవిత్రమైనదని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం రంజాన్ పర్వదినంను పురస్కరించుకొని చందానగర్ డివిజన్ పరిధిలోని వేముకుంటలో ముస్లింల ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన దైవ ప్రార్థనలతో సామరస్యం, శాంతి సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, అక్బర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రాయసముద్రం చెరువు పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప అన్నారు. మంగళవారం రామచంద్రాపురం పట్టణంలోని రాయసముద్రం చెరువును ఉపకమిషనర్ సురేష్‌తో కలసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువును అనుకొని ఉన్న వాకింగ్‌ట్రాక్ వద్ద పిచ్చిమొక్కలు పెరగడంతో వాకర్స్ సమస్యను తన దృష్టికి తీసుకురాగా సొంత నిధులతో శుభ్రం చేయించామన్నారు. చెరువు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం ఉంచాలని అధికారులను కోరారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ముగ్గురికి ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున జరిమానా, ఐదుగురికి రూ .1500, మరో నలుగురికి రూ. వెయ్యి చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

దౌల్తాబాద్ రోడ్డు బాగు చేయాలని వినతి



తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నుండి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. లారీలు, టిప్పర్లు అధికంగా తిరుగుతుండటంతో రోడ్డు గుంతమయమైందని బాగు చేయాలని బీజేపీ మండల అధ్యక్షులు వీరేశం కోరారు. బుధవారం పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంద్రేశం–దౌల్తాబాద్ రోడ్డులో ప్రయాణించాలంటే గ్రామస్తులు, విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో బీజేపీ పటాన్‌చెరు నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, జిల్లా నాయకులు అల్లం రాజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ధనుంజయగౌడ్, రమేష్, మండల కిసాన్‌మోర్చా అధ్యక్షులు వెంకటయ్య, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌కు

కొత్త ఎక్సైజ్ స్టేషన్

- ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో కార్యాలయం
- ఏప్రిల్ 1 నుంచి కార్యకలాపాలు
- ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మణ్‌గౌడ్



శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్

చందానగర్: ఇటీవల రాష్ట్రంలో కొత్తగా ఎక్సైజ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో శేరిలింగంపల్లి మండలంలోని ఎక్సైజ్ స్టేషన్ రెండుగా విడిపోనుంది. శేరిలింగంపల్లి అభివృద్ధి చెందుతున్న క్రమంలో భారీగా కార్యాలయాలు, ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. దశాబ్ద కాలంలో శేరిలింగంపల్లి మండలం భారీగా విస్తరించడం.. సుమారు 15 లక్షలకు పైగా ప్రజలు నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ప్రజల రక్షణ, భద్రత కోసం చందానగర్, మియాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్లు ఇప్పటికే ఉన్నాయి. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ మాత్రం ఒక్కటే ఉంది. క్రైమ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అరకొర భద్రత సిబ్బంది ఉండడం వలన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత కొన్ని సంవత్సరాల నుంచి మరో ఎక్సైజ్ స్టేషన్ కావాలని ఉన్నతాధికారులకు విన్నవించగా ఎట్టకేలకు 2024లో శేరిలింగంపల్లి మండలంలో నూతనంగా కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం 6 నెలల తరువాత హఫీజ్‌పేట్‌లోని ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న నైట్ షెల్టర్ భవనంలో కొండాపూర్ ఎక్సైజ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతానికి శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ ఇంచార్జిగా వ్యవహరిస్తున్నారు.

- మండలంలో ఉన్న ఎక్సైజ్‌స్టేషన్‌ను డివిజన్‌లవారీగా విభజన చేశారు.
- కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోకి మాదాపూర్, కొండాపూర్ డివిజన్లు ఉంటాయని, శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గచ్చిబౌలి, చందానగర్, మియాపూర్, శేరిలింగంపల్లి డివిజన్లు వస్తాయి.
- ఇప్పటికి వరకు ఉమ్మడి శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో 39 వైన్ షాపులు, 134 బార్‌లు ఉన్నాయి.
- విభజన తరువాత శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లోకి 21 వైన్ షాపులు, 73 బార్‌లు, కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌లోకి 18 వైన్ షాపులు, 71 బార్‌లు ఉండనున్నాయి.
- త్వరలోనే ఓల్డ్ హఫీజ్‌పేట్ ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న నైట్ షెల్టర్ భవనంలో కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్ ఏర్పాటవనుంది.

క్రైం రేటు తగ్గించడానికే విభజన



శేరిలింగంపల్లి మండలం చాలా పెద్దది. దానికి తోడు జనాభా పెరుగుతోంది. సుమారు 5 లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లు ఉన్న చోట కేవలం ఒక్క ఎక్సైజ్ స్టేషన్ ఉంది. గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రభుత్వానికి మరో స్టేషన్ ఏర్పాటు చేయాలని విన్నవించాం. 2024 నవంబర్‌లో ఉత్తర్వులు వచ్చాయి. త్వరలో కొండాపూర్ ఎక్సైజ్‌స్టేషన్‌కు పూర్తి స్థాయి సిబ్బందిని కేటాయిస్తారు. క్రైమ్ కేసులు అదుపు చేయడానికి సులువు. అప్పటి వరకు శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్ ఇంచార్జిగా వ్యవహరిస్తుంది. – లక్ష్మణ్ గౌడ్, ఇన్‌స్పెక్టర్, శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్‌స్టేషన్



కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్ ఏర్పాటుకానున్న హఫీజ్‌పేట్ నైట్ షెల్టర్ బిల్డింగ్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఎంఐజీ కాలనీలో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర, సంతులిత అభివృద్దే ధ్యేయమని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. బుధవారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో సుమారు రూ.98.50 లక్షలతో సీసీ రోడ్లు, వరద నీటి కాలువ పనులకు కార్పొరేటర్ సింధు ఆదర్శరెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కాలనీల అభివృద్ధి ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం రూ.49.00 లక్షలతో సీసీ రోడ్లు, రూ.49.50 లక్షలతో వరద నీటి కాలువ నిర్మాణాలు చేపడతారన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

అన్ని చెరువులను సుందరీకరిస్తాం



చెరువు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్: డివిజన్ పరిధిలోని అన్ని చెరువుల దశదిశ మారనుందని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు సుందరీకరణ పనులను మల్లిగావాడ్ ఫౌండేషన్ సభ్యులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని గురునాథం చెరువు తరహాలో మిగతా చెరువులు సుందరీకరించి త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు ఆనంద్ మల్లిగావాడ్, సభ్యులు రామ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

గుడికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

25 గ్రాముల బంగారు నగలు, రూ.30వేల డబ్బు, స్కూటీ చోరీ

మియాపూర్: ఇంటికి తాళం వేసి గుడికి వెళ్లి వచ్చేసరికి దొంగలు పడి బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌లోని శ్రీసాయినగర్ కాలనీలో శ్రీకాంత్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి కొమరవెల్లి మల్లన్న దర్శనానికి వెళ్లారు. మరుసటి రోజు బుధవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఇంటి యజమాని దామోదర్‌రెడ్డి శ్రీకాంత్‌కు కాల్ చేసి ఇంటి తాళం పగిలిపోయిందని సమాచారం అందించారు. వెంటనే శ్రీకాంత్, కుటుంబ సభ్యులు వచ్చి చూడగా బీరువాలో ఉన్న సుమారు 25 గ్రాముల బంగారు నగలు, రూ.30వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. అదేవిధంగా ఇంటిముందు పార్కు చేసిన స్కూటీ సైతం మాయమైందని మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో శ్రీకాంత్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హెచ్‌సీయూ భూములు వెనక్కి తీసుకోవడం తగదు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పార్లమెంటు చట్టం, సిక్స్ పాయింట్ ఫార్ములా ఆధారంగా ఏర్పడిందని, ఇలాంటి విద్యావనానికి సంబంధించిన భూములను ప్రభుత్వం ఏదో ఒక సాకుతో వెనక్కి తీసుకోవడం తగదని హెచ్‌సీయూ మాజీ ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో బుధవారం విద్యార్థుల సంఘం, టీచింగ్ అసోసియేషన్, నాన్ టీచింగ్ అసోసియేషన్, వర్కర్స్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 'హెచ్‌సీయూ స్థాపన, ఆక్రమణ, అనివార్యమైన విద్యార్థుల ప్రతిఘటన' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం కారణంగా సిక్స్‌పాయింట్ ఫార్ములా ఆధారంగా హెచ్‌సీయూను ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 2,300 ఎకరాల స్థలం కేటాయించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం 400 ఎకరాల భూములను వివాదంలోకి తేవడం సరికాదన్నారు.

అన్నమాచార్య ఆరాధన వేడుకలు



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో బుధవారం అన్నమాచార్య ఆరాధన వేడుకలను నిర్వహించారు. డాక్టర్ శోభారాజు శిష్యబృందం అన్నమాచార్య అష్టోత్తర శతనామావళి (108 నామాలు)తో అర్చించారు. అన్నమయ్య వివిధ సంకీర్తనలను ఆలపించి సందర్శకులను అలరించారు. కీబోర్డు రాజు, తబలాపై అజయ్ వాయిద్య సహకారాన్ని అందించారు. పద్మశ్రీ డాక్టర్ శోభారాజు రచించి స్వరపరిచిన .. ఎక్కడున్నావ్ ఓ కల్కి.. ప్రత్యేక కీర్తనను ఈ సందర్భంగా ఆలపించారు. కార్యక్రమంలో విశ్వసనాతన సేవాట్రస్ట్ చైర్మన్ పండిత్ కాశీనాథ్ మిశ్ర, ధర్మసాధన సమస్త అధ్యక్షులు మోహన్ సుందర్ గురూజీ, , మోహన్ బెహరా, ప్రొఫెసర్ ముళ్ళపూడి సత్యనారాయణ మూర్తి, రామయోగిజీ లు పాల్గొని అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు.

ఆస్తి పన్నుపై వడ్డీలో 90% రాయితీ

పటాన్‌చెరు: ఆస్తి పన్ను బకాయిల వడ్డీపై 90% మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి బుధవారం ఓ ప్రకటన లో తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి, వ్యాపార సంస్థల యజమానులు తమ ఆస్తి పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈనెల 31 లోపు ఆస్తి పన్ను బకాయిలన్నింటిని చెల్లిస్తే బకాయిలపై ఉన్న వడ్డీలో 90 శాతం రాయితీ పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం వన్ టైం సెటిల్మెంట్ కింద ఈ అవకాశాన్ని కల్పించిందని తెలిపారు.

శంషాబాద్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభలు

- ఏప్రిల్ 21, 22 తేదీల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- ఆహ్వాన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు

శంషాబాద్: కార్మికుల శ్రమదోపిడీని అడ్డుకునేందుకు భవన నిర్మాణ కార్మిక సంఘం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం అవుతోందని భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభల ఆహ్వాన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు అన్నారు. ఏప్రిల్ 21, 22వ తేదీల్లో శంషాబాద్‌లో నిర్వహించనున్న వెల్లడించారు. రాష్ట్ర స్థాయి మహాసభలకు కార్మికులు వేలాదిగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికుల శ్రమదోపిడీతో కాంట్రాక్టర్లు కోట్లు గడిస్తున్నారన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి శివార్లలో జరుగుతున్న అనేక నిర్మాణాల్లో వలస కార్మికుల పరిస్థితి దుర్భరంగా ఉందన్నారు. వలస కార్మికుల సంక్షేమం, భద్రత కోసం తాము పోరాడతామన్నారు. అడ్డాల వద్ద మౌలిక వసతులు, భోజన ఏర్పాట్ల కోసం కూడా పోరాడుతున్నట్లు చెప్పారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నర్రగిరి, ఆర్.యాదగిరి, నర్సింహారెడ్డి, అన్నపు ప్రభు పాల్గొన్నారు.

30 నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

మణికొండ: ఓయూ కాలనీ కనకదుర్గాదేవి ఆలయంలో ఈనెల 30 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు వసంత నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. 9 రోజుల పాటు రోజూ సాయంత్రం ప్రత్యేక అలంకరణలలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. మొదటి రోజు 30వ తేదీన ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, విఘ్నేశ్వరపూజ, కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. ఏప్రిల్ 3న చండీహోమం, అన్నదానం ఉంటాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



చంద్రమౌళీశ్వరస్వామి



ఆలయంలో కలశ పూజ

రాయదుర్గం: వేదబ్రాహ్మణుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ఆలయ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. బుధవారం గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం వేదస్వస్తితో దంపతులచే ఆలయ ప్రదక్షిణ, భూతబలి, అఖండ దీపారాధన, గణపతిపూజ పుణ్యాహవచనం, శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం రాజరాజేశ్వరిమాత, చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో కలశపూజలను ప్రత్యేకంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఉపాధి హామీ పనులకు.. కూలీల అనాసక్తి

- రెండు చోట్లే ప్రారంభమైన పథకం పనులు
- ప్రధానంగా శ్రద్ధ చూపని పురుషులు
- కూలీ తక్కువగా ఉందనే కారణంగా పనులకు రానివైనం
- వేసవిలో వసతులు కల్పిస్తున్నా కానరాని ఫలితం



పాల్మాకులలో సాగునీటి కాలువలో మట్టి పనులు చేస్తున్న కూలీలు

శంషాబాద్ రూరల్: ఏడాదిలో కుటుంబానికి వంద రోజులు పని కల్పించేందుకు అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకంపై కూలీలు ఆసక్తి చూపడం లేదు.. ఈ పథకంలో ప్రయోజనకర పనులను చేపట్టకపోవడం కూడా అమలులో ఆటంకాలు ఎదురవుతున్నాయి.

- శంషాబాద్ మండల పరిధిలో 21 పంచాయతీలకుగాను కేవలం రెండు పంచాయతీల్లో మాత్రమే ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయి. పాల్మాకుల, ననాజీపూర్‌లో సాగునీటి వరద కాలువల్లో మట్టి పనులు చేపట్టారు. రెండు చోట్ల 42 మంది కూలీలు పనులు చేస్తున్నారు.
- ముఖ్యంగా వేసవిలో కూలీలకు ఉపాధి కల్పించడానికి పనులను గుర్తించి కార్యాచరణ రూపొందించారు.

పూడికతీతకు మంగళం...

ఉపాధి హామీ పథకంలో గతంలో ఆయా పంచాయతీల పరిధిలో చెరువులు, కుంటల్లో పూడికతీత పనులను చేపట్టారు. ప్రస్తుతం పూడికతీత పనులను కాకుండా ఇతర పనులకు ప్రాధాన్యత కల్పించారు. పాల్మాకుల చెరువులో మైసమ్మ చెరువు అలుగు నుంచి పారే సాగునీటి కాలువ, ననాజీపూర్‌లో ఫిరంగి కాలువలో పనులు గుర్తించారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఆయా సాగునీటి కాలువల్లో మట్టి పనులు చేపట్టారు. రోజూ కూలీ రూ. 300లకు సరిపడేలా పని చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇందు కోసం కాలువలో నిర్దేశించిన సైజులో మట్టి పని చేయాల్సి ఉంటుంది.

- మూడు మీటర్ల వెడల్పు, మూడున్నర మీటర్ల పొడవు, 0.3 మీటరు లోతులో మట్టి తవ్వకాలు చేయాలి. ఈ పని కోసం ఇద్దరిని నియమించారు. ఈ పని చేస్తే ఒక్కొక్కరికి రూ. 300 కూలీ లభిస్తుంది.
- పాల్మాకులలో ఈ నెల 3న పనులు ప్రారంభం కాగా.. ననాజీపూర్‌లో ఫిబ్రవరి 17 నుంచి కూలీలు పనులు చేస్తున్నారు.
- ఇదిలా ఉండగా సుల్తాన్‌పల్లిలో ఎంటేరువాగులో మట్టి పనులు గుర్తించగా.. కూలీలు ముందుకు రాకపోవడంతో పనులు చేపట్టలేదు.
- నర్ఖూడ శివారులో అమ్మపల్లి ఆలయం సమీపంలో సాగునీటి కాలువలో మట్టి తీసే పని గుర్తించారు. ఇక్కడ పట్టా పొలాలు ఉండటంతో రైతులు పనులు చేయడానికి ఆసక్తి చూపడంలేదు.

మహిళలే ఆసక్తిగా...

ప్రస్తుతం రెండు పంచాయతీల్లో చేపడుతున్న పనుల్లో ఒకరిద్దరు మినహా అందరూ మహిళా కూలీలు ఉన్నారు. పాల్మాకులలో 19 మంది పనికి వస్తుండగా.. వీరిలో 17 మంది మహిళలు పనులు చేస్తున్నారు. ననాజీపూర్‌లో 23 మందిలో ఒక్కరే పురుష కూలీ ఉన్నారు. మట్టి పనుల్లో భాగంగా మహిళలే గుంతలు తవ్వి మట్టిని తొలగిస్తున్నారు.

- ఇదిలా ఉండగా వేసవి దృష్ట్యా కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పిస్తున్నారు. తాగు నీరు, నీడ కోసం షేడ్‌నెట్ ఏర్పాటు చేస్తున్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ కిట్‌తో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను సమకూర్చుతున్నారు.
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కూలీలు పనులు చేస్తున్నారు. తక్కువ కూలీతో గిట్టుబాటు కావడంలేదనే కారణంగా పురుషులు పనులు చేసేందుకు రావడంలేదని స్థానికులు పేర్కొంటున్నారు.

రైతులకు ప్రయోజనం...

ఉపాధి హామీ పథకంలో రైతులకు ప్రయోజనం సమకూరేలా పనులు ఉన్నా పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పొలాల్లో వరద కట్టలు, వాన నీటి నిల్వ కోసం గుంతలు ఏర్పాటు చేసుకునేందుకు ఈ పథకంలో అవకాశం కల్పించారు. దీంతో పాటు పాడి రైతులు పశువుల పాకను నిర్మించుకునేందుకు కూడా ఈ పథకం అమలు చేస్తున్నారు.

చెరువులో దిగి బాలుడు మృత్యువాత



కార్తీక్(ఫైల్)

గచ్చిబౌలి: చెరువులోకి దిగిన బాలుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపిన ప్రకారం .. కామారెడ్డి జిల్లా డోంగ్లీ మండలం, కుర్లీ గ్రామానికి చెందిన దంపతులు బాయమ్మవార్ మల్కయ్య, బాలమణిలు నానక్‌రాంగూడ వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటున్నారు. వీరికి ఒక కూతురు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్ద కొడుకు కార్తీక్(14) నానక్‌రాంగూడలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం మల్కయ్య, బాలమణి ఉదయం 7.30 గంటలకు పనులకు వెళ్లి సాయత్రం 5.30 గంటలకు తిరిగి వచ్చారు. కార్తీక్ కనిపించకపోవడంతో సమీప ప్రాంతాలలో వెదికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో విప్రోలేక్ (వెంకటయ్య చెరువు)లో బాలుడి మృతదేహం తేలియాడుతుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా తల్లిదండ్రులు కార్తీక్‌గా గుర్తించారు. బాలుడు మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారి అదృశ్యం



మల్లిక (ఫైల్)

మియాపూర్: చిన్నారి ఆడుకుంటూ వెళ్లి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని ఓంకార్ నగర్ బస్తీలో నివాసముంటున్న కడమంచి మహేష్, సుజాత దంపతులకు ఓ కుమారుడు, కూతురు మల్లిక(6) ఉన్నారు.కుమారుడు హాస్టల్‌లో ఉంటుండగా కూతురు తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. ఈ నెల 21వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో మల్లిక ఆడుకునేందుకు బయటకు వెళ్లింది. కొంత సమయం తర్వాత కూతురి కోసం తల్లిదండ్రులు బయటకు వెళ్లి చూడగా కనిపించలేదు. దీంతో చుట్టుపక్క వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి మహేష్ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.